ఆ మనోహరుణ్ణి మనసారా ప్రేమించిన ఆమె చివర్లో ఎందుకు మారిపోయింది?

డా. ఎమ్ సుగుణా రావు కథ

# జీవితపరమార్థం

ఆ సాయంకాలం బీచ్‌లో ఇసుకమీద పిచ్చిగీతలు గీస్తున్న కిన్నెర మనసులో మనోహరం ప్రత్యక్షమయినాడు. ఆరునెలల క్రితం యూనివర్శిటీ ఆడిటోరియంలో ఉపన్యసిస్తూండగా చూసిందతన్ని. ఉపన్యాసం ముగిస్తూ చెప్పినమాటలు ఇంకా గుర్తున్నాయి ఆమెకు. ''జంతువుల్నించి పరిణామం చెందిన మనిషి జంతువులతోపాటు తనలోని జంతువును వేటాడగలిగినపుడే మనిషవుతాడు'' అని.

—లవ్ ఎట్ ఫస్ట్ సైట్ మీద నమ్మకం లేదు ఆమెకు అంతవరకూ. అతణ్ణి చూసిన తర్వాత, అతని వాక్ప్రవాహాలు ఆమె ఎదలో తుళ్ళి తాకిన తరువాత ఒక కొత్త అనుభూతికి లోనయ్యింది. తన పరిధుల్ని దాటి అతడి వివరాలు సేకరించింది. బాల్యావస్థలోనే తల్లీదండ్రీ పోయారనీ, అనాథ శరణాలయంలోనే పెరిగాడనీ, స్వయం కృషితో ఎమ్మెస్సీ రాంకుతో పాసయ్యి కిన్నెర ఇండస్ట్రీస్‌లో కెమిస్టుగా ఉద్యోగం చేస్తున్నాడనీ, రోజూ రాత్రి పదకొండువరకూ గాజువాకలో రాత్రి పాఠశాల నడుపుతాడనీ, యూనివర్శిటీ విద్యార్థుల సహకారంతో ఓ అర్ఫాన్ హౌస్ నడుపుతున్నాడనీ, సాహిత్య సమావేశాలలో తరచు ఆహ్వానింపబడతాడనీ మనోహరం గురించిన విషయాలు ఆమెకు తెలిసాయి. తమ ఫ్యాక్టరీలోనే సంవత్సరంనుంచి పనిచేస్తున్నా అతడి విషయం తెలీనందుకు బాధపడింది. పొడుగ్గా, దృఢంగా, ఫిలాసఫర్‌లా కొద్దిగా పెరిగిన గడ్డంతో, ముక్కుమీద జారీ కళ్ళజోడు, పొడుగు చేతుల చొక్కా చాలా వదులుగా ఇన్‌షర్ట్‌చేసి, తన కళ్ళలో ఎవరికీ



అంతుచిక్కని భావాలు దాచుకుంటూ, 'అమ్మో ఇతణ్ణి తక్కువ అంచనా వేయకూడదు సుమా' అనిపించేట్టు ఉంటాడు.

'అవును మనోహరుడు చాలా మనోహరమైనవాడే' అనుకుంది కిన్నెర.


గోదారొడ్డున కూర్చుని ఆకాశంలో మబ్బుల్ని గమనించడం ఎంత ఇష్టమో, వెన్నెల్లో ఆరుబయట కృష్ణశాస్త్రిని చదువు

తూ లతామంగేష్కర్ స్వరమాధుర్యాన్ని ఆస్వాదించడం ఎంత చక్కటి అనుభవమో అలాంటి తాదాత్మ్యమే మనోహరాన్ని గురించిన ఆలోచనలతో ఆమెకు కలుగుతోంది.

వైజాగ్‌నుంచి హైదరాబాద్‌వరకూ విస్తరించిన రకరకాల పరిశ్రమలలో అనేక షేర్లు కలిగివున్న పురుషోత్తమరావు అనబడే బిజినెస్ మాగ్నెట్ గారాబుపట్టి, చలం చెప్పిన 'ఎకానమీ ఆఫ్ థాట్స్ అండ్ వర్డ్స్'ని తుచ తప్పకుండా పాటించే ఆ అమ్మాయి అంత తీవ్రంగా ఆలోచించడానికి, ప్రేమలో పడడానికీ కారణాలు వెతికితే ధనిక జీవితంలో పుట్టి, పెరుగుతున్నా ఆ వాతావరణానికి అతీతంగా ఆలోచించడం నేర్చుకుంది. అలా ఆలోచించడం ఆమెకో థ్రిల్. ఎమ్మే సోషియాలజీ విద్యార్థిని కాబట్టి సామాజిక విలువలు, భౌతిక వాదం వంటి విషయాల గురించి ఆలోచించడం, చర్చించడం ఆమెకు ఇష్టం. మనోహరం ఉపన్యాసంలో ఆమెకు ఆసక్తి కలిగించే విషయాలు ఉండటంతో ఆమె అతడి వ్యక్తిత్వంపట్ల ఆకర్షించబడింది. "అమ్మా వెళ్ళిపోదామా?" అన్న డ్రైవర్ మాటలతో ఊహల్లోంచి వాస్తవంలోకి వచ్చింది. బీచ్‌లో జనం పలచబడ్డారు. టైమ్ చూసుకుంది. తొమ్మిది కావస్తోంది. గబగబా అడుగులేస్తూ రోడ్డుమీదకొచ్చింది. కొద్దిదూరంలో కారు పార్క్ చేసి డ్రైవర్ ఆమెకోసమే ఎదురుచూస్తున్నాడు. "ఇదివరకూ స్నేహితురాళ్ళతో బీచ్‌కు వచ్చేది. ఇప్పుడు ఒంటరిగా వస్తోంది. పదిమందిలో వున్నా మనసు ఏకాంతాన్నే కోరుకుంటోంది" కొంపదీసి పిచ్చెక్కదుకదా అనుకుంది కిన్నెర. రోడ్డు క్రాస్ చేసి కారెక్కి కూర్చుంది. మనసంతా హాయిగా వుంది. టేప్‌రికార్డర్‌లో మంద్రస్థాయిలో వస్తున్న టీనాచార్లెస్ పాట. కళ్ళు మూసుకున్నా మనోహరం రూపమే ఆమె కళ్ళముందు ప్రత్యక్షమవుతోంది. డ్రైవర్‌ని సడన్‌గా అడిగింది. "మన ఫ్యాక్టరీ లాబ్‌లో కెమిస్ట్‌గా పనిచేసే మనోహరం తెలుసా నీకు అని— ఆ ప్రశ్న వేసినందుకు అతను ఆశ్చర్యపడి— 'ఆయన తెలీకపోవడం ఏమిటమ్మా, ఫ్యాక్టరీలో ఎవరికి ఏ కష్టం వచ్చినా చూసుకునేది ఆయనే' డ్రైవర్ చెప్పిన సమాధానమే ఆమె చాలా మంది దగ్గరా వింది. ఇంకా అతడి గురించి ఏమైనా విశేషాలు చెపుతాడేమో అని చూసింది. ఆమె ఆసక్తి గమనించి అతడు చెప్పడం ప్రారంభించాడు. "ఆ బాబులాంటి వాళ్ళు అరుదుగా కనిపిస్తారమ్మా. సరిగ్గా రెండు నెలల క్రితం కాబోలు డాబా గార్డెన్స్ దగ్గర ఓ ముసలావిడని స్కూటర్‌వాడు గుద్దేసి పోతూవుంటే అందరూ అలా గుడ్లప్పగించి చూస్తున్నారే తప్ప ఆ ముసలిది చావుబతుకుల్లో ఊగిసలాడుతుంటే సంశయించారే తప్ప ఎవరన్నా ముందుకొచ్చారా? ఈయన అటు వెళ్ళబట్టి, ఆవిడను తన స్వంత ఖర్చులతో ఆసుపత్రికి తీసుకెళ్ళబట్టి ఆ జీవం ఆరిపోలేదమ్మా... గాజువాకలో కాలనీ మనుషులు ఈయన్ని దేవుడిలా కొలుస్తారమ్మా..." ఇంకా ఏదో చెప్తున్నా కిన్నెర మనసంతా మనోహరం చుట్టూ తిరుగుతోంది. 'తన భావాలకు ఊపిరిపోయగలిగే అలాంటి వ్యక్తి తనతో ఏడడుగులూ నడిస్తే, తనతో జీవితం పంచుకుంటే... ఆమెలో పరిపరివి

ధాలుగా ఆలోచనలు. 'అసలు డాడీ ఈ పెళ్ళికి ఒప్పుకుంటారా, ఇంత పెద్ద ఫేక్టరీలో కెమిస్టుగా చేసే వ్యక్తిని తను పెళ్ళి చేసుకుంటే ఆయన తట్టుకోగలరా, —అసలు పరిచయమయినా లేని మనిషితో పెళ్ళివరకూ వెళ్ళకలిగిన తన ఆలోచనకు సిగ్గుపడింది. కారు తమ ఇంటి పోర్టికోలో ఆగేంతవరకూ ఆమె ఆలోచనలకు బ్రేక్ పడలేదు.

ఆరోజు తరువాత రెండు రోజులకే మనోహరంతో స్వయంగా మాట్లాడే అవకాశం కలిగింది. స్థానిక లేడీస్‌క్లబ్ వారు 'సామాజిక పరిణామంలో స్త్రీ' అనే విషయంమీద సెమినార్ ఏర్పాటుచేయడంతో మనోహరాన్ని ఉపన్యాసకుడిగా ఆహ్వానించడం జరిగింది. ఆ క్లబ్ కార్యదర్శి కిన్నెర మేనత్త కావడంతో మనోహరాన్ని సెమినార్‌కు తీసుకొచ్చే బాధ్యత ఆమెపై వేసింది. ఎవరిద్వారా






నైనా అతన్ని ఆహ్వానించే అవకాశం లేకపోలేదు. అయినా ఈ అవకాశం వదులుకోదలచ లేదు. మనోహరంతో మాట్లాడదామని ఆమె హృదయం తహతహలాడుతోంది. సెమినార్‌కు ఇంకా చాలారోజులు టైమున్నా ఉత్సాహం ఆపుకోలేక ముందే బయలుదేరింది ఒంటరిగా కార్లో. సీతమ్మధారలో అతనుంటున్న ఇల్లు గుర్తుపట్టడం కష్టం కాలేదు. పచ్చగా పెరిగిన పూలమొక్కలతో పర్ణశాలలా కనిపిస్తున్న మూడుగదులున్న కాటేజు. కారు పక్కనే పార్కుచేసి గేటుతీసి లోపలికి అడుగేసింది. ఆమె రాకను గమనించిన మనోహరం బైటకొచ్చి, మీరు... అని ఆగిపోయాడు. ఆమెకూడా నేను... అంటూ నోట్లోంచి మాటలు రానిదై శిలాప్రతిమలా వుండిపోయింది. మనోహరం వెంటనే గుర్తించాడు. ఆమె తన జి.ఎమ్‌గారి అమ్మాయి అని. క్షణంసేపు ఆలోచనలో పడ్డాడు. ఆమె రాకకు కారణం ఏమైవుంటుందా,' అని. అతనేమీ మాట్లాడకపోవడంతో "నా పేరు కిన్నెర" అంది చేతులు జోడించి. 'బావుంది' కూర్చోండి అన్నాడు. ఏమిటీ బావుంది పేరా? నేనా? అనుకుంటూ కూర్చుంది.

ఆమె ఏమీ మాట్లాడకపోవడంతో అతనే ప్రారంభించాడు. "మీ ఫ్యాక్టరీలోనే పనిచేసే ఒక చిన్న ఉద్యోగి ఇంటికి వచ్చేరంటే మీ అంతరంగంలోని విశాలత నాకర్థమవుతోంది. నానుంచి మీరేం ఆశిస్తున్నారు? నేను చేయదగిన సహాయం ఏమిటి?" అడిగేడు ఆమె వంక తిరిగి.

"మీ గురించి నేను చాలా విన్నాను...మీ ఉపన్యాసం విని తన్మయత్వం చెందేను. మిమ్మల్ని కలుసుకోవడం ఆనందంగా భావిస్తున్నాను అంది గబగబా...

ఆమె ఏవేవో ఊహించుకొంది అతడితో మాట్లాడదామని. కాని గొంతులోంచి భావాలు ఊడిపడటం లేదు.

"వచ్చే ఆదివారం 'విమెన్స్‌లిబ్'వారు 'సామాజిక పరిణామంలో స్త్రీ' అనే విషయంమీద సెమినార్ నిర్వహిస్తున్నారు. మీ ఉపన్యాసం తప్పనిసరిగా వుండాలని అంతా కోరడంతో నేనే వచ్చాను. మీ పరిచయం ఏర్పడుతుందనీ—' చెప్పేసి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకొని ప్రశాంతంగా కూర్చుంది.

ఒకసారి శూన్యంలోకి చూసి కిన్నెర వంక తిరిగేడు. 'సన్నగా, పొడుగ్గా– మెరుస్తున్న పచ్చటి శరీరచ్ఛాయ. కనకాంబరం రంగుచీర. అందం, అమాయకత్వం కలబోసినట్లు ఈ అమ్మాయి డబ్బున్నవాళ్ళ భేషజాలకు అతీతంగా కనిపిస్తోందేమిటి చెప్మా' అని ఆలోచనలో పడ్డాడు. తనవంకే చూస్తున్న మనోహరంవైపు తిరిగింది. ఆ చూపుల్లోని భావాలు అర్థంకాక తలొంచుకుంది.

ఒక నిముషం వరకూ ఇద్దరిమధ్యా నిశ్శబ్దం. "ప్లీజ్ కూర్చోండి" అని లోపలికెళ్ళి ట్రేలో కాఫీ కప్పులతో బైటకొచ్చాడు. ఆమెకు మాటలు కరువయ్యాయి. రిజర్వ్‌డ్‌గా వుండే మనోహరం మౌనంగా అయిపోయాడు.


"తప్పనిసరిగా ఈ సెమినార్‌లో పాల్గొంటాను. మీరింత శ్రమ తీసుకుని వచ్చారుగా" అన్నాడు మనోహరం. ఆ సమావేశానికి స్వస్తి పలుకుతూ. "కృతజ్ఞులం"అని సంతృప్తిగా ముందుకు కదిలింది కార్లో కిన్నెర.

ఆరోజు తర్వాత లేడీస్‌క్లబ్‌లో సెమినార్ ముగిసిన మర్నాటినుంచీ కిన్నెర మనోహరానికి దగ్గరకావడానికి ప్రయత్నించింది.

రామకృష్ణా బీచ్‌లో, నక్షత్రాల చీకటి ఛాయలో మనోహరంతో మాటలు– బ్రిటన్ మాగ్నాకార్టానుంచి భారత రాజ్యాంగం వరకూ, అనిబిసెంట్‌నుంచి దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ వరకూ, ఫ్రెంచ్ విప్లవంనుంచి

రజాకార్ల తిరుగుబాటువరకూ, ఫ్రాయిడ్‌నుంచి జిడ్డు కృష్ణమూర్తి వరకూ, ఎన్నో విషయాలు. "ఇన్నోసెంట్‌గా కనిపించే ఈ అమ్మాయి భావాలను ఫిక్సెడ్ డిపాజిట్‌లా దాచుకుందే ఫరవాలేదు. ప్రోగ్రెసివ్ థింకర్" మనసులో అనుకునేవాడు. వారి చర్చలు అలా సాగుతున్న సమయంలోనే పురుషోత్తమరావుకు విషయం అంతా తెలిసింది. బిజినెస్‌లో ఒక షేరు విలువ పడిపోతే ఎంత దిగులుపడతాడో, అటువంటి షాక్‌కే లోనయ్యాడు. ఒకరోజు రాత్రి కిన్నెర తన గదిలో 'వార్ అండ్ పీస్' పుస్తకం సీరియస్‌గా చదువుతున్న సమయంలో వెళ్ళి ఆమె ప్రక్కనే కూర్చుంటూ— "ఏం తల్లీ ఇంకా పడుకోలేదా?" అన్నాడు నెమ్మదిగా. 'డాడీ అంత హఠాత్తుగా రూమ్‌లోకొచ్చారేమిటి?' అని ఆలోచనలో పడింది.

మనోహరం విషయం తండ్రితో చెపుదామని చాలారోజులనుంచీ అనుకుంటోంది. ప్రస్తుతం ఆయన రాక అదే విషయం గురించే అని అర్థం చేసుకుంది. ఆమె ఆలోచనల్లో వుండటంతో ఆయనే ప్రారంభించేడు. "అమ్మా, నువ్వూ, మనోహరం కల్సి ఈ మధ్య హిందూ రీడింగ్ రూమ్‌లోనూ, బీచ్ దగ్గరా, రెండుమూడుసార్లు కనిపించినట్లు తెలిసింది. ఏమిటీ అసలు విషయం అన్నాడు నెమ్మదిగా. ఆ మాటలకు కొంచెం కలవరపడినా, వెంటనే తేరుకుని, "ఆయన వ్యక్తిత్వం నాకు చాలా నచ్చింది డాడీ, "సెన్స్ ఆఫ్ ప్రాక్టికాలిటీ, జీవితంపట్ల ఏంచుకున్న నిర్ణయాలు, వీటన్నింటితో ప్రజలలో చాలా అడ్మైరింగ్ సంపాదించుకున్నారు. నా ఆశయాలకు, అభిరుచులకు బాగా దగ్గరైనారు. ఆయన్ని పెళ్ళి చేసుకుందామనే విషయంలో మీతో సంప్రదించుదామనే అనుకుంటున్నా. ధైర్యంచాలక ఊరుకున్నాను.. తలొంచుకునే చెప్పింది కిన్నెర తండ్రితో. పురుషోత్తమరావు అసలు ఆశ్చర్యపోలేదు ఆ మాటలకు. చిన్నప్పుడు జూలో కిన్నెర ఓ లేడిపిల్లను చూసి అదే కావాలని పట్టుపట్టి ఏడ్చిన విషయం గుర్తుకొచ్చింది. "అవును, ఆమె చాలా ఆలోచించిగానీ



నిర్ణయం తీసుకోదు, తీసుకున్న తర్వాత మార్చుకోదు. తాను ఎంబియ్యే చదవమంటే ఎమ్మే సోషియాలజీలో జాయిన్ అయింది. చివరికి ఈ నిర్ణయం మరొకటి. నిట్టూర్పు విడిచేడు పురుషోత్తమరావు.

ఆరోజు రాత్రి ఓ పెగ్ ఎక్కువ పుచ్చుకున్నాడు అంతర్మథనం తట్టుకోలేక.

ఉదయం లేవగానే పురుషోత్తమరావు చేసిన మొదటి పని పియేకి ఫోన్‌చేసి మనోహరం కాండక్ట్ రిపోర్టు వెంటనే కావాలని చెప్పాడు.

ఆ రిపోర్టు చూసిన తర్వాత చాలా నిరాశ చెందాడు. దాన్నో ఎక్సలెంట్లు తప్ప రిమార్కులు లేవు. ఆయనకు మైనస్ పాయింట్లేమిటంటే మనోహరం ఫాక్టరీ కార్మికులతో మరీ సన్నిహితంగా వుండటం. తన లైవ్‌లో చాలా భాగం సమాజసేవా కార్యక్రమాలలో వినియోగించడం. "తన కూతురిని సుఖపెట్టగలడా లేకపోతే ఫాక్టరీని అప్పులపాలు చేసిపోతాడా అనే బెంగపట్టుకుంది ఆయనకు. అటుచూస్తే కిన్నెర తన నిర్ణయం మార్చుకునేటట్లు లేదు. ఆమె అంటే వున్న విపరీతమైన వాత్సల్యం చేత శాసించలేడు. తన ముగ్గురి కూతుళ్ళలోనూ ఒకరిని ఫారిన్ రిటర్న్‌డ్‌కూ, ఇంకొకరిని బిజినెస్ మాగ్నెట్‌కూ ఇచ్చేడు. ఇప్పుడు కిన్నెర మాత్రం తనకు సమస్యలు సృష్టించబోతోందని అనుకున్నాడు. ఆ తరువాత చాలాసేపు ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చి మనోహరాన్ని పిలిపించాడు తన ఆఫీసుకు.

ఫ్యాక్టరీ జి.ఎమ్ అనగానే క్రింది ఉద్యోగులంతా వినయంతో చేతులు కట్టుకుని నిలబడే విధానానికి వ్యతిరేకంగా "ఏమిటండీ పిలిచారట" అన్నాడు తాపీగా.

మనోహరాన్ని అంతకముందు చాలాసార్లు చూసినా పరిశీలనగా చూడ్డం అదే మొదటిసారి. "కిన్నెర తీసుకున్న నిర్ణయం తప్పుకాదు. అతడు స్ఫురద్రూపి, అద్భుతమైన మేధస్సు కలిగినవాడే, తన వైపునకు త్రిప్పుకుంటే ఆ ఆశయాలు గ్రటా గంగలో కలిపెయ్యడం ఖాయం— 'పదవి' అనే అస్త్రం ఉపయోగించి అతణ్ణి తన ప్రపంచంనుంచి బయటకు తీసుకురావడం నేనిప్పుడు చేయాల్సింది' అలా అనుకుంటూ మెల్లగా ప్రారంభించి మనోహరం పుట్టుపూర్వోత్తరాల గురించి అడిగేడు. అతను చెప్పిన వివరాలన్నీ సేకరించిన వివరాలతో సరిపోవడంతో సంతృప్తిపడ్డాడు. వెంటనే స్టెనోని పిలిచి లెటర్ డిక్టేట్ చేసేడు. మనోహరాన్ని ప్రొడక్షన్ మేనేజర్‌గా ప్రమోట్ చేస్తూ. దేనికిసార్? నాకు ఇదంతా చేస్తున్నారు? అన్నాడు మనోహరం. ఆశ్చర్యం కలిగింది అతనికి. జి.ఎమ్. వివరాలు సేకరించడం తనను ప్రమోట్ చేయడం.

"దేనికేమిటి? మా కిన్నెరకు నువ్వు నచ్చావ్. కెమిస్టునుండి ప్రొడక్షన్ మేనేజరుకు. అక్కడినుంచి డిప్యూటీ జి.ఎమ్‌కూ... "ఇంకా ఏదో చెప్పబోయేంతలో మనోహరం సడన్‌గా అన్నాడు. "నా అభిప్రాయంతో మీకు పనిలేదా?" అని.

పురుషోత్తమరావు ఆశ్చర్యంగా చూసేడు మనోహరం వంక. ఎగిరి గంతేసి తనకు సాష్టాంగ నమస్కారం చేసి, నేలమీద వున్నవాణ్ణి ఆకాశం అంచులవరకూ లాక్కెళ్ళారు,

మీకు జీవితాంతం రుణపడి వుంటానని ఆనందభాష్పాలు రాలుస్తాడని ఊహించిన ఆయనకు క్షణం ఊపిరాడలేదు. "ఏమిటీ నువ్వనేది? కిన్నెరా, నువ్వూ కలిసి చర్చలు జరిపేరట. మనసులు కలిసాయనుకుంటున్నాను" అన్నాడు కొంచెం వ్యంగ్యంగా.

"మనసులు కాదు, కలిసింది మనస్తత్వాలు. సిద్ధాంతపరమైన సామాజిక అవగాహనతో కూడిన చర్చలు జరిపేను మీ అమ్మాయితో. అంతేకాని ప్రేమ కబుర్లు కాదు" అన్నాడు మనోహరం. ఈ మాటలతో పురుషోత్తమరావు అహం దెబ్బతింది. "నీ వ్యక్తిత్వం, తత్వం, నీ మెటీరియాలిస్టిక్ ఐడియాలజీ, అంతా బుల్‌షీట్, మా దృష్టిలో. ఇక్కడ పరిగణింపబడింది కిన్నెరకు నువ్వు నచ్చడం దట్సాల్" అన్నాడు కోపం అణుచుకుంటూ. ఈ మాటలకు కొద్దిగా నవ్వి— "నేను భూమ్మీద ఉన్నవాణ్ణి. మీరు సరిగ్గా ఈ బిల్డింగ్ అంత ఎత్తులో ఉన్నారు. నేను ఎగిరి మీ ఎత్తుకుచేరలేను. మీరూ ఈ భూమ్మీదకు నడిచి రాలేరు. సరిగ్గా పదిహేను రోజుల తర్వాత కూడా నేను మీకు, మీ అమ్మాయికి నచ్చగలిగితే, నాపై ఇదివరకూ వున్న అభిప్రాయమే ఆ పదిహేను రోజుల తర్వాతా ఆమెకూవుంటే మీ ఇంటికి అల్లుడినవుతాను, లేకపోతే నా ఉద్యోగం నాకుంది కదా" అని పురుషోత్తమరావు వంక తిరిగేడు. పేపర్ వెయిట్ ఆడిస్తూ ఆవేశాన్ని కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడాయన. "అన్నట్టు ప్రస్తుతానికి ప్రొడక్షన్ మేనేజర్‌గానే వుండనివ్వండి. అల్లుడు అనే పదం తగిలించొద్దు. అది మీ అమ్మాయికి, నాకు కూడా మంచిది" అని స్టెనో ఇచ్చిన లెటర్ తీసుకుని వెళ్ళిపోయాడు మనోహరం. అతను వెళ్ళిన అరగంటవరకూ ఆలోచిస్తుండిపోయాడు పురుషోత్తమరావు. మనోహరం అంతరంగం అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంటే పెదాలమీద నవ్వు ప్రత్యక్షమయింది. "థాంక్ గాడ్ కిన్నెరకూ, అతడికి మధ్యవున్న ప్రేమ



## ఐపోయింది

"సార్! ఓ వందరూపాయలుంటే అప్పిస్తారా? ఫస్ట్‌కి జీతం రాగానే ఇచ్చేస్తాను!"

"ఎవరివయ్యా నువ్వు? అపరిచితుడివైన నన్ను అప్పు అడగటానికి సిగ్గుగా లేదూ?"

"ఏం చెయ్యమంటారు సార్ మరి? పరిచయస్తులందరి దగ్గరా తీస్కోవడం ఐపోయింది" సిన్సియర్‌గా చెప్పాడు అప్పారావ్.

—మోటూరి రాధ (సికింద్రాబాద్)

'వన్‌వే ట్రాఫిక్' మాత్రమే. అతడామెను ఇంకా ప్రేమించడం ప్రారంభించలేదు'' ఆ ఆలోచనతో సంతృప్తిపడ్డాడు పురుషోత్తమరావు

పురుషోత్తమరావుతో, మనోహరం కలిసిన విషయం, దానికి మనోహరం స్పందించిన తీరు కిన్నెరకు తెలిసి ఆశ్చర్యపోలేదు. మనోహరాన్ని పెళ్ళివైపు మళ్ళించడానికి ఆమె చేసిన ప్రయత్నం విఫలం కావడంతో డైరెక్ట్‌గా తండ్రితో చెప్పేసింది. దాని ఫలితం అతడికి ప్రమోషన్. ఆరోజు సాయంత్రం ప్రొడక్షన్ మేనేజర్‌గా కొత్త బాధ్యత భుజానేసుకుని, దానికి సంబంధించిన ఫైళ్ళను ఇంటికి తీసుకొచ్చేడు మనోహరం. వాటిని పరిశీలిస్తే ఎరువుల ఫ్యాక్టరీ లాభాలతో నడుస్తున్నా వర్కర్ల జీతాలు ఏమాత్రం పెరగలేదు. ఇంతవరకు వారికి సరైన నిష్పత్తిలో బోనస్ అందజేయలేదు. ఫ్యాక్టరీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు చనిపోయిన వర్కర్ల కుటుంబాలకు అందింపబోయిం నామమాత్రం ఇలాంటివే మరెన్నో. పిటన్నిటిమీదా అతనో రిపోర్టు తయారుచేయడానికి నిశ్చయించుకున్నాడు.

ఆ తరువాత రోజు కిన్నెర అతని దగ్గరకొచ్చి శుభాకాంక్షలు తెలియజేసింది. ప్రమోషన్ వచ్చినందుకు థాంక్సండీ. అంతా మీ చేతి చలవే'' అన్నాడు.

''అండీ ఏమిటి, నాన్సెన్స్ మీరు నన్ను కిన్నెర అనే పిలవాలి అంది ముద్దుగా—

''కంగారు పడవద్దు. ఇంకో పదిహేను రోజుల తర్వాత కూడా మీరు నన్ను ప్రేమించగలిగితేనే, అంతవరకూ స్నేహితులం. మూగగా అయింది కిన్నెర ఆ మాటలకు. ''పదిహేను రోజులు కాదని ఎన్ని యుగాలైనా మీపై నా ప్రేమ సడలదు అనుకుంది దృఢంగా. ఆమాటలు పైకి అనడానికి సిగ్గుపడుతూ— ఇంకా తలొంచుకునే అనుభూతుల్లోనే వున్న ఆమెని చూసి కొంచెం కలవరపడ్డాడు మనోహరం. ''ఆమె ప్రభావంలోపడి తను కర్తవ్యం విస్మరించడు కదా అనుకున్నాడు. ''మీకు ప్రమోషన్ వచ్చిన శుభసందర్భంలో పార్టీ ఇవ్వబోతున్నాను. డార్ఫిన్స్‌లో పార్టీ, ఆ తర్వాత సినిమా— ఆమె హఠాత్తుగా అన్న ఆ మాటలకు వెంటనే ''ఈరోజు నేను గాజువాక వెళ్ళాలి. వయోజన కేంద్రం నడుపుతున్నాం, నేను అప్సెంట్ కాకూడదు. సారీ... అనేశాడు.

''ప్లీజ్ ఈ ఒక్కరోజుకూ మానెయ్యండి'' అంది కొంచెం బతిమాలుతూ— ''నన్నర్థం చేసుకో, మూడుగంటలసేపు వినోదంలో తలమునకలవడం కన్నా ఆ టైములో ముప్ఫైమందికి విజ్ఞానం అందివ్వడం మిన్న — అన్నాడు తన ధోరణిలో... అతని మాటలకు ఆమె కోపగించుకుని అక్కణ్ణించి కదిలింది. కారెక్కుతూ తల తిప్పని ఆమెను చూస్తున్న మనోహరానికి.

''నీ ఆదర్శాలూ, ఆశయాలూ

నీలాగా నాజూగ్గా అందంగా

ఉంటాయి.


నువ్వు పాలమీగడల్లోంచి జాబిల్లి అడుగు మీదనుంచి


పువ్వుల పెదాలనుంచి నడిచి వచ్చాయి.

నేను జీవితం ముళ్ళ కంచెలమధ్య, బురదగుంటలమధ్య

నిజం కోసం పరిశోధిస్తూ వుంటాను. ఏ కేంద్రంలో మనమిద్దరం కలుసుకోవడం?'' అన్న 'తిలక్' గుర్తుకొచ్చాడు.

మనోహరం అంతరంగం అర్ధమయ్యేసరికి, అతడి ఆదర్శాలూ, ఆలోచనలూ ఆమెను మరింత కలవరపెట్టేవి. ఆమె కోణంలోంచి చూస్తే— తను అంతస్తుల్ని దాటుకుని ఐశ్వర్యంలేని అతణ్ణి ప్రేమిస్తున్నందుకు, అతడి వ్యక్తిత్వంపట్ల అభిమానం పెంచుకున్నందుకు తప్పనిసరిగా అతడు తన వెంటే తిరగాలని ఆమె అభిలషించింది. ఆమె చేస్తున్న అంతటి గొప్ప త్యాగాన్ని (ఆమె దృష్టిలో) అతను అతి తేలికగా తీసుకోవడం సహించలేకపోతోంది. అతను అంకిత భావంతో చేపట్టే కార్యక్రమాలకు ఆమె అడ్డు



తగిలేది. ఇద్దరూ సాయంకాల సమయాలలో బీచ్ కెళ్ళినప్పుడు ఎవరైనా ఫ్యాక్టరీ వర్కర్లు ఎదురైె వాళ్ళతో మాట్లాడితే "ఛీ అలగాజనం వాళ్ళతో కబుర్లేమిటి, అనేసేది. అతను బాధపడేవాడు. ఒకసారి కిన్నెర బలవంతంమీద కారులో సినిమాకు వెళుతూ— మనోహరం నడిపే "ఆర్ఫాన్ హౌస్" పిల్లలు బస్సుకోసం నిలబడితే వారిని స్కూలువరకూ కారులో తీసుకెళ్ళడం ఆమె విమర్శించింది. మరోసారి ఆమె బర్త్‌డేకి అందరూ వచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తే, మనోహరం సింహాచలంలో ఎవరికో ఏక్సిడెంట్ అయిందని వెళ్ళడంతో ఆమెలో అంతర్గత కల్లోలం ప్రారంభమయింది. ఇలా చాలా విషయాలలో కిన్నెర మనోహరానికి మనస్తాపం కలిగించింది. — "ఆమె భావాలూ, సిద్ధాంతాలూ మనసు వరకే పరిమితం, ఆలోచించడం వరకేగాని, ఆచరణలో క్రియాశీలత లేని మనిషి" అని ఆమె గురించి మనోహరానికి ఒక అభిప్రాయం స్థిరపడింది. వారిద్దరిమధ్యా అలా వైరుధ్యం పెరుగుతుండగానే ఆమెకు మనోహరంపై కోపం మరింత కలిగించే సంఘటన ఒకటి జరిగింది. ప్రొడక్షన్ మేనేజర్‌గా చార్జి తసుకున్న రోజున తెచ్చిన ఫైళ్ళను పదిరోజులు క్షుణ్ణంగా పరిశీలించి రాసిన రిపోర్టు పురుషోత్తమరావుకు అందించేడు. దానిలో ఇదివరలో వర్కర్లకివ్వాల్సిన బోనస్‌లూ, ఎక్స్‌గ్రేషియా, వారికి వైద్య సదుపాయాలు కల్పించాలనీ సిఫార్సు మొత్తం బడ్జెటు రెండు లక్షలు. దాన్ని పురుషోత్తమరావు చదివి లైటర్ తీసి వెలిగించి కాగితం అంటించేడు. ఆ రిపోర్టు బూడిదయ్యేవరకూ చూసి ఇక మీరెళ్ళొచ్చు . అన్నాడు తాపీగా.

జరిగిన విషయానికి బాధపడి నిర్లిప్తంగా కదిలేడు మనోహరం అక్కణ్ణించి.

ఆరోజు సాయంకాలం గంటసేపు వాదించింది కిన్నెర మనోహరంతో— "డాడీ మనసు నొప్పించకండి. ఫాక్టరీ విషయాలలో మనకు జోక్యం వద్దు. కావలిస్తే చిన్న మొత్తాలను వాళ్ళ చేతుల్లో పెడదాం. అంతేకాని లక్షల్లో రూపాయల్ని వాళ్ళకోసం ఖర్చు చెయ్యాలా, అమ్మో" అని గుండెలమీద చెయ్యివేసుకుంది కిన్నెర.

మనోహరం చాలా ఆశ్చర్యపోయాడు ఆమె మాటలకు.

"ఈమేనా మార్క్స్ చారిత్రకభౌతికవాదం గురించి తనతో చర్చించింది, మానవ అస్తిత్వానికి కారణమైన 'శ్రమ' గురించి తన అభిప్రాయాలతో ఏకీభవించింది. అతను మనసులో అనుకున్నాడు ఇదివరకు ఆమెతో జరిపిన సంభాషణలు మననం చేసుకుంటూ ఆమె అతడితో వాదించి ఇక లాభం లేదని అక్కణ్ణించి నిష్క్రమించింది. అదేవారి ఆఖరి సమావేశం.


ఆరోజు రాత్రి ఇంటిముందు లాన్‌లో కూర్చుని ఆలోచిస్తున్న కిన్నెర మనసులోంచి మనోహరం అదృశ్యమయ్యాడు. అవును అతను మనోహరుడే, మనసును హరించేవాడు. అంటే చంపేవాడు అనుకుందామె ఆఖరిసారిగా అతని గురించి.

అదే సమయంలో బీచ్‌లో నడుస్తూ జరిగిన సంఘటనలను పునరావలోకనం చేసుకుంటున్నాడు మనోహరం. "అవును తనకు

నచ్చిన పనే చేశాడు. వారి గమ్యంలోనే ప్రయాణిస్తే ఏమయ్యేది? తన "స్టాండర్డ్ ఆఫ్ లివింగ్" పెరిగేది. కాని వాళ్ళెక్కించిన మెట్లే తనకు జారుడుమెట్లయ్యేవి. ఆలోచనల్లో వున్న మనోహరానికి ఇసుకలో పిచ్చుక గూళ్ళు కడుతున్న పిల్లలు కనిపించేరు. తను ప్రాణంగా భావించే అనాథ శరణాలయం పిల్లలు గుర్తుకొచ్చారు. వాతావరణం చేత నాగరికత చేత కలుషితం కాబడిన మనసులు వాళ్ళవి— వారి సహవాసంతోనే తనకు ఆనందమూ, తన జీవితాదర్శమూ. కారణం తనూ అనాథలా పెరిగాడు కాబట్టి.

ఇంతలో లైట్‌హౌస్ వెలుగు కనిపించింద తనికి. దానివైపు దృష్టిసారించేడు. "ఆ వెన్నెల్లో ఆలోచనల్లో అంతః కలహాలకి గురైన మనోహరానికి ఏదో తెలీని జీవిత సత్యం అవగతమయ్యింది. తన జీవిత పరమార్థం బోధపడింది. మనసు తేలికయింది. లోలోపల సున్నితంగా మెదిలింది జేసుదాస్ పాట—

"ఫూల్ మిలే యా అంగారే సచ్ కే రాహోంపే చల్ తా చల్



జీనా ఉస్‌కా జీనా హైజో ఔరోంకో జీవన్ దే తాహై

(ఎవరెస్టుకన్నా ఎత్తయిన నా ఊహాశిఖరాల్ని వీళ్ళెక్కలేరు. సింధూరం కన్నా ఎరుపైన నా హృదయాన్ని వీళ్ళు చదవలేరు'' అంటూ ఈ కథ రాయడానికి స్ఫూర్తి నిచ్చిన 'తిలక్'కి ఈ కథ భక్తితో అంకితం చేస్తున్నాను... రచయిత)

